నేటి మ్యాచ్‌లు | అఫ్గానిస్థాన్ X ఉగాండా – గయానా – ఉ. 6.00 | ఇంగ్లండ్ X స్కాట్లాండ్ – బార్బడోస్ – రా. 8.00 | నెదర్లాండ్స్ X నేపాల్ – డల్లాస్ – రా. 9.00 | www.ntnews.com

నమీబియా సూపర్

లో స్కోరింగ్ థ్రిల్లర్‌లో అద్భుత విజయం

పోరాడి ఓడిన ఒమన్.. రాణించిన డేవిడ్ వీస్

ట్రంపెల్‌మెన్ (4/21)

పొట్టి ప్రపంచకప్ ఆరంభంలోనే సంచలనాలకు వేదికవుతోంది. ఈసారి 20 జట్లతో నిర్వహిస్తున్న ఈ టోర్నీలో 'పసికూన'లు సైతం సత్తా చాటుతున్నాయి. తొలిరోజు అమెరికా, కెనడా 'హైస్కోరింగ్ గేమ్' అభిమానులను ఉర్రూతలూగిస్తే రెండో రోజు నమీబియా, ఒమన్ మధ్య బార్బడోస్ వేదికగా జరిగిన 'లో స్కోరింగ్ థ్రిల్లర్' ఫ్యాన్స్‌కు అసలైన టీ20 మజాను పంచింది. ఇరుజట్లూ 109 పరుగులు చేయడానికి నానా తంటాలు పడటంతో మ్యాచ్ 'టై'గా ముగిసింది. కానీ ఫలితం నిర్ణయించే 'సూపర్ ఓవర్'లో అదరగొట్టిన నమీబియానే విజయం వరించింది. ఆ జట్టు ఆల్‌రౌండర్ డేవిడ్ వీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. ఓడినా ఒమన్ పోరాటం ఆకట్టుకుంది.

బార్బడోస్: టీ20 ఫార్మాట్ అంటేనే బ్యాటర్ల బాదుడుకు మారుపేరు. కానీ స్వల్ప స్కోర్లు నమోదైన మ్యాచ్‌లలోనే అసలైన క్రికెట్ మజా ఉంటుందనడానికి మరో నిదర్శనం సోమవారం బార్బడోస్ వేదికగా నమీబియా, ఒమన్ మధ్య జరిగిన మ్యాచ్. గ్రూప్-బిలో ఈ జట్ల మధ్య జరిగిన పోరులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఒమన్.. 19.4 ఓవర్లలో 109 పరుగులకే ఆలౌటైంది. ఖలీద్ కైల్ (39 బంతుల్లో 34, 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. అనంతరం ఛేదనలో నమీబియా సైతం 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 109 పరుగుల వద్దే ఆగిపోవడంతో మ్యాచ్ 'టై' అయింది. సూపర్ ఓవర్‌లో నమీబియా 21 రన్స్ స్కోరు చేయగా ఒమన్ 10 పరుగులే చేసింది. నమీబియా ఆల్‌రౌండర్, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' డేవిడ్ వీస్ బంతితో పాటు బ్యాట్‌తోనూ రాణించి ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు.

'ట్రబుల్'మెన్:

ఒమన్ ఇన్నింగ్స్ తొలి రెండు బంతుల్లో రెండు వికెట్లు. 10 పరుగులకే ముగ్గురు ఔట్. నమీబియా పేసర్ ట్రంపెల్‌మెన్ (4/21) విజృంభణతో ఒమన్ వణికిపోయింది. అతడి ధాటికి ఒమన్ బ్యాటర్లు క్రీజులో నిలవలేక వచ్చినోళ్లు వచ్చినట్టే పెవిలియన్‌కు చేరారు. మధ్య ఓవర్లలో వీస్ (3/28) కూడా రెచ్చిపోవడంతో ఒమన్ కుదేలైంది. ఈ ఇద్దరి ధాటికి ఆ జట్టు బ్యాటర్లలో ఏకంగా ఏడుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

సంక్షిప్త స్కోర్లు:

ఒమన్: 19.4 ఓవర్లలో 109 ఆలౌట్ (ఖలీద్ 34, జీషన్ 22, ట్రంపెల్‌మెన్ 4/21, వీస్ 3/28). **నమీబియా:** 20 ఓవర్లలో 109/6 (ఫ్రైలింక్ 45, డేవిన్ 24, మెహ్రాన్ 3/7, అయాన్ 1/12)

ఫ్రైలింక్ పోరాడినా..:

స్వల్ప ఛేదనలో నమీబియా సైతం తొలి బంతికే వికెట్ కోల్పోయింది. కానీ ఓపెనర్లు నికోలస్ డేవిన్ (24), జాన్ ఫ్రైలింక్ (48 బంతుల్లో 45, 6 ఫోర్లు) ఆ జట్టును విజయం దిశగా నడిపారు. కానీ కీలక సమయంలో ఒమన్ బౌలర్లు సమిష్టిగా రాణించి నికోలస్‌తో పాటు కెప్టెన్ ఎరాస్మస్ (13), స్మిత్ (8), ఫ్రైలింక్, గ్రీన్ (0) వికెట్ల పడగొట్టి ఆ జట్టుపై ఒత్తిడి పెంచారు. విజయానికి ఆఖరి ఓవర్‌లో నమీబియా 5 పరుగులు చేయకపోవడంతో ఆట సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

'సూపర్' సాగిందిలా..

సూపర్ ఓవర్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నమీబియా తరపున డేవిడ్ వీస్.. 4,6,2,1 స్కోరు చేయగా ఎరాస్మస్ 4,4 బాదడంతో ఆ జట్టు 21 పరుగులు చేసింది. కానీ ఒమన్.. 2 వికెట్లు కోల్పోయి 10 పరుగులే చేసింది. వీస్ 2 వికెట్లు పడగొట్టాడు.

నేటి నుంచే ఇండోనేషియా ఓపెన్

జకర్తా: పారిస్ ఒలింపిక్స్ సమీపిస్తున్న వేళ మునపటి ఫామ్‌ను అందుకోవడానికి భారత బ్యాడ్మింటన్ స్టార్లకు మరో అవకాశం. మంగళవారం నుంచి జకర్తా వేదికగా ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నీ మొదలుకానుంది. ఇటీవలే ముగిసిన సింగపూర్ ఓపెన్‌లో నిరాశపరిచిన భారత షట్లర్లు జకర్తాలో అయినా పుంజుకోవాలని భావిస్తున్నారు. పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్-చిరాగ్, సింగిల్స్ విభాగాల్లో హెచ్ ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్ బరిలో ఉన్నారు. మహిళల సింగిల్స్ విభాగంలో తెలుగమ్మాయి పీవీ సింధు అదృష్టాన్ని పరీక్షించుకోనుండగా సింగపూర్ ఓపెన్‌లో సంచలన విజయాలు నమోదుచేసిన గాయత్రి-త్రిసా ద్వయం, తనీషా-అశ్విని జంట బరిలో నిలిచారు.

కేదార్ జాదవ్ రిటైర్మెంట్

ముంబై: భారత వెటరన్ ఆటగాడు కేదార్ జాదవ్ అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 39 ఏండ్ల జాదవ్ ఈ మేరకు సోమవారం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించాడు. 'కెరీర్ ఆసాంతం నాకు మద్దతు పలికినవారందరికీ ధన్యవాదాలు' అని ఇన్‌స్టా పోస్టులో రాసుకొచ్చాడు. 2014లో జాతీయ జట్టులోకి అరంగేట్రం చేసిన జాదవ్.. 2020లో భారత్ తరపున ఆఖరి మ్యాచ్ ఆడాడు. ఆరేండ్ల అంతర్జాతీయ కెరీర్‌లో 73 వన్డేలు ఆడి 52 ఇన్నింగ్స్‌లో 1,389 పరుగులు చేసి 27 వికెట్లు పడగొట్టిన అతడు.. 9 టీ20లలో 122 పరుగులు చేశాడు.

లంక చిత్తుగా

నోకియా పేస్‌కు విలవిల.. దక్షిణాఫ్రికా ఘన విజయం

నోకియా (4/7)

న్యూయార్క్: టీ20 వరల్డ్ కప్‌లో పసికూనలు సైతం పోరాడుతుంటే మాజీ చాంపియన్ శ్రీలంక మాత్రం తమ తొలి మ్యాచ్‌లో కనీస పోరాటం లేకుండానే చేతులెత్తేసింది. సౌతాఫ్రికా బౌలర్లు సమిష్టిగా రాణించగా నిప్పులు చెరిగే బంతులుతో విజృంభించిన పేసర్ అన్రిచ్ నోకియా (4/7) సంచలన స్పెల్‌కు లంకేయులు విలవిల్లాడారు. ఫలితంగా దక్షిణాఫ్రికా.. 6 వికెట్ల తేడాతో హసరంగ సేనపై ఘనవిజయం సాధించింది. సఫారీ బౌలర్ల ధాటికి మొదట బ్యాటింగ్ చేసిన లంక.. 19.1 ఓవర్లలో 77 పరుగులకే ఆలౌట్ అయింది. ఓపెనర్ కుశాల్ మెండిస్ (19) టాప్ స్కోరర్ కాగా 8 మంది బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యారు. 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' నోకియాతో పాటు మరో పేసర్ రబాడా (2/21), స్పిన్నర్ కేశవ్ మహారాజ్ (2/22) చెలరేగారు. స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌతాఫ్రికా సైతం తడబాటుకు లోనై విజయం కోసం 16.2 ఓవర్లు ఆగాల్సి వచ్చింది. క్వింటన్ డికాక్ (27 బంతుల్లో 20, 1 సిక్స్), క్లాసెన్ (22 బంతుల్లో 19 నాటౌట్, 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు.

మొదట బ్యాటింగ్ చేసిన లంక.. 4వ ఓవర్లో ఓపెనర్ పతుమ్ నిస్సంక ఔట్ అయ్యాక క్రమం తప్పకుండా వికెట్లను కోల్పోయింది. నోకియా, మహారాజ్ లంకను కోలుకోనీయలేదు. ఆ జట్టు భారీ ఆశలు పెట్టుకున్న సమరవిక్రమ డకౌట్ అవగా అసలంక (6), కుశాల్ మెండిస్ (11), శనక (9) దారుణంగా విఫలమయ్యారు.

ఛేదనలో రెండో ఓవర్లోనే సఫారీలు హెండ్రిక్స్ (4) వికెట్ నష్టపోయింది. కెప్టెన్ మార్క్‌రమ్ (12), ట్రిస్టన్ స్టబ్స్ (13) విఫలమైనా క్లాసెన్, మిల్లర్ (6 నాటౌట్) లంకకు అవకాశమివ్వకుండా మ్యాచ్‌ను పూర్తిచేశారు.

సంక్షిప్త స్కోర్లు:

శ్రీలంక: 19.1 ఓవర్లలో 77 ఆలౌట్ (మెండిస్ 19, మాథ్యూస్ 16, నోకియా 4/7, రబాడా 2/21). దక్షిణాఫ్రికా: 16.2 ఓవర్లలో 80/4 (డికాక్ 20, క్లాసెన్ 19 నాటౌట్, హసరంగ 2/22, శనక 1/6)

విజేతలకు భారీ నజరానా

దుబాయ్: పొట్టి ప్రపంచకప్‌లో విజేతలకు ప్రకటించే నగదు బహుమానాన్ని ఐసీసీ భారీగా పెంచింది. టోర్నీ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఈ ఎడిషన్‌కు 11.25 మిలియన్ యూఎస్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 93.5 కోట్లు) ప్రైజ్ మనీని ప్రకటించింది. టైటిల్ విజేతగా నిలిచిన జట్టుకు ఏకంగా 2.45 మిలియన్ డాలర్లు (రూ. 20.3 కోట్లు), రన్నరప్‌నకు 1.28 మిలియన్ డాలర్లు (రూ. 10.36 కోట్లు) దక్కనున్నట్టు ఐసీసీ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గత టీ20 వరల్డ్ కప్‌లో (5.6 మిలియన్ డాలర్లు) కంటే ఈసారి రెట్టింపు ప్రైజ్‌మనీ ప్రకటించడం గమనార్హం.

జొకో కష్టమ్మీద

ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ డిఫెండింగ్ చాంపియన్ నొవాక్ జొకోవిచ్ మరో మారథాన్ మ్యాచ్‌తో క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. పురుషుల సింగిల్స్ నాలుగో రౌండ్‌లో టాప్ సీడ్ జొకో.. 6-1, 5-7, 3-6, 7-5, 6-3తో అర్జెంటీనా కుర్రాడు ఫ్రాన్సిస్కో సెరుండొలొపై అతి కష్టమ్మీద నెగ్గాడు. సుమారు 4 గంటలకు పైగా సాగిన ఈ పోరులో 23వ సీడ్ ఫ్రాన్సిస్కో.. జొకోపై గెలిచినంత పనిచేసినా ఆఖరి వరకూ పోరాడిన సెర్బియా స్టార్ క్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. నాలుగో రౌండ్‌లో ఐదో సీడ్ రష్యా ఆటగాడు మెద్వెదెవ్.. 6-4, 2-6, 1-6, 3-6తో అలెక్స్ డి మినొర్ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. జన్నిక్ సిన్నర్.. 2-6, 6-3, 6-2, 6-1తో కొరెంటిన్ (ఫ్రాన్స్)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరాడు. భారత సీనియర్ టెన్నిస్ ఆటగాడు రోహన్ బోపన్న, మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) ద్వయం ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్స్ చేరింది. పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో బోపన్న జోడీ.. 6-7 (2/7), 6-3, 7-6 (10/8) తో మరో భారత ఆటగాడు శ్రీరామ్ బాలాజీ-రెయిస్ వరెల (మెక్సికో)పై గెలిచి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది.

భారత్‌కేనా సౌకర్యాలు?

టీమ్ ఇండియాపై ఐసీసీకి పలు జట్లు ఫిర్యాదు!

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో భారత్‌కు కల్పిస్తున్న సౌకర్యాలపై శ్రీలంక, సౌతాఫ్రికా, ఐర్లాండ్ గుర్రుగా ఉన్నాయి. న్యూయార్క్‌లోని నసావు స్టేడియానికి అత్యంత సమీపాన ఉన్న హోటల్‌లో సకల సౌకర్యాలు అనుభవిస్తున్న భారత జట్టుతో పోలిస్తే తాము తిప్పలు పడుతున్నామని ఆ జట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఫ్లోరిడాలో వామప్ మ్యాచ్‌లు ఆడిన శ్రీలంక, ఐర్లాండ్.. న్యూయార్క్‌లో మ్యాచ్‌లు ఆడాల్సి వస్తే వేలాది కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని, తద్వారా ప్రయాణ బడలికలు, లాజిస్టికల్ సవాళ్లను ఎదుర్కొంటున్నామని వాపోతున్నాయి. శ్రీలంక జట్టు గత శుక్రవారం ఫ్లోరిడా నుంచి న్యూయార్క్‌కు ప్రత్యేక విమానంలో రాత్రి 8 గంటలకు చేరాల్సి ఉండగా విమానం ఆలస్యమవడంతో మరుసటి రోజు ఉదయం 5 గంటల దాకా విమానాశ్రయంలోనే వేచి చూడాల్సి వచ్చింది. అంతేగాక లంకేయులు ఉంటున్న హోటల్ గది స్టేడియం నుంచి గంటన్నర సమయం పడుతుండటంతో వారి ప్రాక్టీస్ సెషన్స్‌కు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దక్షిణాఫ్రికా, ఐర్లాండ్ సైతం ఇదే సమస్యలతో సతమతమవుతూ ఐసీసీకి కంప్లైంట్ చేసినట్టు తెలుస్తోంది.

హైదరాబాద్ సూపర్ 8 లీగ్ విజేత క్లస్టర్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ శ్రీనిధి డెక్కన్ అండతో హైదరాబాద్ లిటిల్ స్టార్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన హైదరాబాద్ సూపర్ లీగ్ 8వ సీజన్‌లో క్లస్టర్స్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్‌లో క్లస్టర్స్ 1-0తో గ్లాడియేటర్స్ ఎఫ్‌సీపై గెలిచింది. గత నెల 12 నుంచి జూన్ 2 దాకా సాగిన ఈ సీజన్ ప్రేక్షకులను అలరించింది. తెలంగాణ యువతకు ఫుట్‌బాల్‌లో అవకాశాలను మరింత పెంచడానికి ఈ లీగ్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చిత్రం

అవును.. రిలేషన్‌లో ఉన్నా

తన తాజా సినిమా 'మనమే' ప్రమోషన్‌లో బిజీబిజీగా గడుపుతున్నది బెంగళూరు భామ కృతిశెట్టి. వరుసపెట్టి టీవీ ఛానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చేస్తున్నది. ఈ క్రమంలో ఎదురవుతున్న చిలిపి ప్రశ్నలకు కూడా తెలివిగా సమాధానాలిచ్చేస్తున్నది ఈ అందాల బేబమ్మ. 'మీరు సింగిలా? రిలేషన్‌షిప్‌లో ఉన్నారా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'నేను సింగిల్ కాదు. రిలేషన్‌లోనే ఉన్నా' అని సూటిగా సమాధానమిచ్చేసింది. 'ఎవరితో?' అనడిగితే.. 'నా పనితో.. నా పనితో రిలేషన్‌లో ఉన్నా' అంటూ నవ్వులు పూయించేసింది కృతిశెట్టి. కాబోయేవాడు ఎలావుండాలి? అనడిగితే.. 'మంచివాడై ఉండాలి. నిజాయితీపరుడై ఉండాలి. సాటివారిపై దయ కలిగినవాడై ఉండాలి' అంటూ అందంగా నవ్వేసింది. ఇంకా చెబుతూ 'నాకు డ్యాన్స్ చేయడం ఇష్టం. యాక్షన్ సినిమాలు ఇష్టం. హీరోల్లో రామ్‌చరణ్ అంటే అభిమానం. కలిసి నటించే అవకాశం వస్తే మిస్ చేసుకోను' అంటూ చెప్పుకొచ్చింది కృతి శెట్టి.

వేటపై పడి విరుచుకుతినే సింహంలా..

'పుష్ప-2' విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో మేకర్స్ వేగం పెంచారు. తాజాగా విడుదలైన 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' సాంగ్ ప్రేక్షకులను ఓ స్థాయిలో ఆకట్టుకుంటున్నది. ఇప్పటికే 'పుష్పరాజ్'గా రెండు మూడు స్టిల్స్ బన్నీవి విడుదల చేశారు. అలాగే, రష్మిక లుక్స్ కూడా రెండు మూడు విడుదల చేశారు. ఇక 'పుష్ప పుష్ప పుష్పరాజ్..' పాట అయితే.. రెండు తెలుగురాష్ట్రాల్లో మోత మోగిపోతున్నది. ఇదిలావుంటే ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ ఒకటి వినిపిస్తున్నది. అది 'పుష్ప-2' ఇంటర్వెల్ గురించి. భారీ యాక్షన్ సీక్వెన్స్‌గా ఈ ఇంటర్‌వెల్ సీన్‌ని ప్లాన్ చేశారట దర్శకుడు సుకుమార్. ఈ ఫైట్‌లో వేటపై పడి విరుచుకుతినే సింహంలా కనిపిస్తారట అల్లు అర్జున్. ఈ యాక్షన్ సీక్వెన్స్ సినిమాకే హైలైట్ కానున్నది సమాచారం. మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వరాలందిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 15న ఈ సినిమా విడుదల కానుంది.

సాగరతీరంలో ఆటపాట

నచ్చిన కథలకి ఓకే చెబుతూ, నిజాయితీగా సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు అక్కినేని నాగచైతన్య. ఈ క్రమంలో విజయాలను, అపజయాలను సమానంగా అందుకుంటున్నాడు. ప్రస్తుతం ఆయన చందు మొండేటి దర్శకత్వంలో 'తండేల్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా డిసెంబర్ 20న విడుదల కానుంది. ఇదిలావుంటే.. 'తండేల్' నిర్మాణంలో ఉండగానే, మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడు చైతు. 'విరూపాక్ష'తో వంద కోట్ల విజయాన్ని అందుకున్న దర్శకుడు కార్తీక్ దండు దర్శకత్వంలో ఆయన నటిస్తున్నారు. ఇంకా పేరు నిర్ణయించని ఈ సినిమా షూటింగ్ వైజాగ్‌లో మొదలుకానుంది. నాగచైతన్య, ఇతర ప్రధాన తారాగణంపై ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తారట. అలాగే, చైతూపై ఓ స్పెషల్ సాంగ్‌ని కూడా ఈ షెడ్యూల్‌లోనే ప్లాన్ చేశారు దర్శకుడు కార్తీక్ దండు. ఇందులో చైతూ కొత్తగా కనిపిస్తారని, ఆయనకు కార్తీక్ దండు న్యూ మేకోవర్ ఇస్తున్నారని యూనిట్ సభ్యుల సమాచారం. పూజాహెగ్డే కథానాయికగా ఖరారైనట్టు వార్తలొస్తున్నాయి. శ్రీవెంకటేశ్వర సినీచిత్ర(ఎస్‌వీసీసీ) పతాకంపై బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మల్లెపూల ట్యాక్సీ తేరా మల్లేశా..

చేతన్‌కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటిస్తున్న చిత్రం 'ధూం ధాం'. సాయికిశోర్ మచ్చా దర్శకుడు. ఎం.ఎస్.రామ్‌కుమార్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లిరికల్ సాంగ్ ప్రోమోని మేకర్స్ విడుదల చేశారు. గాయని మంగ్లీ పాడుతూ, ఈ పాటలో నర్తించినట్టు సాంగ్ ప్రోమోలో తెలుస్తున్నది. 'మల్లెపూల ట్యాక్సీ తేరా మల్లేశా..' అంటూ సాగిన ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, గోపీ సుందర్ స్వరపరిచారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాలో సాయికుమార్, వెన్నెల కిశోర్, పృథ్వీరాజ్, గోపరాజు రమణ, శివన్నారాయణ, బెనర్జీ, తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి మాటలు: ప్రవీణ్‌వర్మ, కెమెరా: సిద్ధార్థ్ రామస్వామి, నిర్మాణం: ప్లైడే ఫ్రేమ్ వర్క్స్.

యాక్షన్ థ్రిల్లర్ 'వాట్ ది ఫిష్'

నిహారిక కొణిదెల, వెన్నెల కిషోర్, అదితి, జాన్సన్, హరినాథ్ పోలిచెర్ల తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'వాట్ ది ఫిష్'. 'వెన్ ద క్రేజీ బికమ్స్ క్రేజీయర్' ఉపశీర్షిక. వరుణ్ కోరుకొండ దర్శకుడు. సూర్య బెజవాడ నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌లో అదితి, జాన్సన్, హరినాథ్ పోలిచెర్ల, సుస్మితా ఛటర్జీ, సత్య జాయిన్ అయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'యాక్షన్ కామెడీ థ్రిల్లర్ కథాంశమిది. ఇప్పటికే విడుదలైన నిహారిక కొణిదెల, వెన్నెల కిషోర్ ఫస్ట్‌లుక్ పోస్టర్స్‌కు మంచి స్పందన లభించింది. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నాం. వివిధ భారతీయ భాషల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి శక్తికాంత్ కార్తీక్ సంగీతాన్నందిస్తున్నాడు.

బంపరాఫర్ కొట్టేసింది

మంగళూరు సోయగం పూజా హెగ్డేకు గత కొంత కాలంగా అదృష్టం కలిసి రావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు వరుసగా పరాజయం చెందడంతో రేసులో పూర్తిగా వెనకబడిపోయింది. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తాను మంచి రోజుల కోసం ఎదురు చూస్తున్నానని ఆశాభావం వ్యక్తం చేసింది భామ. ఆమె కోరుకున్నట్లుగానే తమిళంలో సూర్య సరసన నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. ప్రస్తుతం సూర్య పీరియాడిక్ చిత్రం 'కంగువ'లో నటిస్తున్నారు. ఇది పూర్తయిన వెంటనే కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్‌లో నటించనున్నారు. సూర్య నటించబోతున్న 44వ చిత్రమిది. ఈ నెలలోనే సెట్స్‌మీదకు వెళ్లనుంది. తాజాగా ఈ సినిమాలో కథానాయికగా పూజాహెగ్డేను ఖరారు చేశారు. 'బీస్ట్' తర్వాత పూజాహెగ్డే తమిళంలో మరే చిత్రంలో నటించలేదు. సుదీర్ఘ విరామం తర్వాత అక్కడ భారీ అవకాశాన్ని దక్కించుకోవడం విశేషం. ఈ చిత్రం తప్పకుండా పూజా హెగ్డే కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందని, ఆమె తిరిగి పూర్వ వైభవాన్ని సాధిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

ఇంటిని గుడిలా మార్చింది!

బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య ఉదంతం యావత్ దేశాన్ని కలచివేసింది. నాలుగేళ్ల క్రితం ముంబయిలోని సొంత అపార్ట్‌మెంట్‌లో ఆయన ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. సుశాంత్ మరణానంతరం ఆయన ఇంటిని కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదు. ముంబయిలో పేరొందిన రియల్ ఎస్టేట్ ఏజెంట్స్ సైతం ఇల్లు అమ్మకం కష్టమని తేల్చిచెప్పారు. అయితే బాలీవుడ్ నటి ఆదాశర్మ ఆ ఇంటిని కొనుగోలు చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు వార్తలొచ్చాయి. తాజాగా ఆమె ఈ విషయాన్ని ధృవీకరించారు. సుశాంత్‌సింగ్ ఇంటిని కొనుగోలు చేశానని, ప్రస్తుతం తాను అదే ఇంట్లో ఉంటున్నానని తెలిపింది. 'నెల క్రితమే ఆ ఇంటిలోకి మారాను. మొదటి అంతస్తుని మొత్తం గుడిగా మార్చాను. ఈ ఇంట్లో అడుగుపెట్టగానే పాజిటివ్ వైబ్స్ కనిపించాయి. ఇంటిని పూర్తిగా ఆధునీకరించాను. ప్రత్యేకంగా మ్యూజిక్ రూమ్, డ్యాన్స్ స్టూడియోలను ఏర్పాటు చేశాను. టెర్రస్‌ను మొత్తం గార్డెన్‌లా మార్చేశా' అని చెప్పింది.

నా జీవితంలో గుర్తుండిపోయే పాట

'పదేళ్లుగా కలిసున్న స్నేహితులందరం కలిసి పనిచేసిన సినిమా 'సత్యభామ'. కాజల్ టైటిల్‌రోల్ చేస్తుంది అనగానే సినిమాపై ఆసక్తి పెరిగింది. ఇది ఆమెకు పర్‌ఫెక్ట్ కమ్‌బ్యాక్ మూవీ. ఇందులో యాక్షన్ సీక్వెన్స్ చూస్తున్నప్పుడు బాగా ఎంజాయ్ చేశాను' అని సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల అన్నారు. కాజల్ ప్రధానపాత్రలో సుమన్ చిక్కాల దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సత్యభామ'. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కళపల్లి నిర్మాతలు. ఈ నెల 7న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల విలేకరులతో ముచ్చటించారు. 'ఓ పోలీస్ ఆఫీసర్ ఎమోషనల్ జర్నీ ఈ సినిమా. ఇందులోని ట్విస్ట్‌లు, టర్న్‌లు ఊహించని రీతిలో ఉంటాయి. యాక్షన్ ఎపిసోడ్స్ అన్నీ డూప్ లేకుండా చేసింది కాజల్. ఆమెలోని స్పిరిట్ చూసి ప్రేరణ పొంది మ్యూజిక్ అందించాను. థ్రిల్లర్, యాక్షన్ సినిమాలను ఇష్టపడే వాళ్లకు 'సత్యభామ' బాగా నచ్చుతుంది' అన్నారు శ్రీచరణ్ పాకాల. 'ఇందులో మొత్తం అయిదు పాటలు ఉంటాయి. కాజల్ ఇన్వెస్టిగేషన్ నేపథ్యంలో వచ్చే 'వెతుకు వెతుకు..' సాంగ్‌ని కీరవాణి ఆలపించారు. నా లైఫ్‌లో గుర్తుండిపోయే పాట ఇది. అలాగే.. కాజల్, నవీన్‌చంద్రపై తీసిన 'కళ్లారా చూశాలే..' సాంగ్ యూత్‌ని విశేషంగా అలరిస్తుంది' అని ఆయన తెలిపారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.